‘సిద్ధం’ సభను విజయవంతం చేద్దాం

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి
- ఎమ్మెల్సీ హనుమంతరావు, గంజి చిరంజీవితో కలిసి పోస్టర్ల ఆవిష్కరణ



సిద్ధంసభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ హనుమంతరావు, గంజి చిరంజీవి

మంగళగిరి: ఒంగోలు జిల్లా మేదరమెట్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించ తలపెట్టిన సిద్ధం సభకు అంతా సన్నద్ధం కావాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పిలుపునిచ్చారు. నగరంలోని ఆటోనగర్‌లో గల ఆయన కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయ కర్త గంజి చిరంజీవి, పార్టీ నాయకులు దొంతిరెడ్డి వేమారెడ్డి, చిల్లపల్లి మోహనరావు, దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు అరుణకుమారి, నాయకులు ఎండీ ఫిరోజ్, ఆకురాతి రాజేష్‌లతో కలసి ఎమ్మెల్యే ఆర్కే సిద్ధం సభ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజ్యాధికారాన్ని కట్టబెట్టాలనే దిశగా గౌరవ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గత ఐదేళ్లుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ బాటలో నడుస్తూ రాష్ట్ర రాజకీయాల్లో విప్లవాత్మకమైన మార్పును తీసుకువచ్చారని కొనియాడారు. నేను చేసిన మంచి, మేలు మీ కుటుంబాలకు అందాయంటేనే నాకు అండగా నిలబడాలని ధైర్యంగా చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు కుట్రలు, కుతంత్రాలు పన్నుతూ పేదల మీద యుద్ధానికి సిద్ధం అవుతుంటే సీఎం జగన్ తనకు ఇచ్చిన రాజ్యాధికారానికి సరియైన జవాబు చెబుతూ ఒంగోలు జిల్లా మేదరమెట్లలో సిద్ధం పేరుతో గొప్ప బహిరంగ సభను నిర్వహిస్తున్నారన్నారు. ఈ సభకు నియోజవర్గంలోని ప్రతి ఒక్కరూ తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. ప్రజాభీష్టం మేరకు జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకునేందుకు అంతా కలసి కట్టుగా పని చేయాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో నిర్వహించిన మూడు సిద్ధం మహాసభలు విజయవంతం అయ్యాయని, అదే కోవలో ఒంగోలు జిల్లా మేదరమెట్లలో జరిగే సిద్ధం మహాసభకు నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక ప్రజలకు ఉపయోగపడే ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని కొనియాడారు. దేశం గర్వించదగిన రీతిలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ఏపీ ప్రజలకు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ ఏడాది ఏప్రియల్‌లో జరిగే ఎన్నికలకు ప్రజలను, కార్యకర్తలను సన్నద్ధం చేస్తున్నారన్నారు. అందులో భాగంగా సిద్ధం పేరుతో భీమిలి, ఏలూరు, రాప్తాడులో భారీ ఎత్తున సిద్ధం మహాసభలను నిర్వహించి విజయవంతం చేసిన విషయం ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. చివరిగా మేదరమెట్లలో 20 లక్షల మంది ప్రజలతో సిద్ధం సభ జరుగనుందని, ఈ సభకు నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సాయం

అందజేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు


అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న నాయకులు


పాఠశాలలో ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ పరిధిలోని పెదవడ్లపూడి గ్రామంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఓ కుటుంబానికి మంగళగిరి శాసన సభ్యులు ఆళ్ళ రామకృష్ణారెడ్డి మంగళవారం ఆర్థిక సాయం ప్రకటించి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు జవ్వాది నరేంద్ర చేతుల మీదుగా అందజేయించారు. పెదవడ్లపూడి గ్రామానికి చెందిన కట్టిపోగు వినోద్ ఎస్సీ కాలనీలో ఓ ఇంట్లో అద్దెకు నివాసముంటున్నాడు. రాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు వ్యాపించి ఇంట్లో ఉన్న సామాగ్రి మొత్తం దగ్ధం అయ్యింది. విషయం తెలుసుకున్న మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ళ రామకృష్ణారెడ్డి వినోద్ కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారని జవ్వాది నరేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాలేటి కృష్ణవేణి, థామస్, రామయ్య, అగస్టీన్, రాంబాబు, లాజరు, బాలాజీ నాయక్, భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి పట్టణ పరిధిలో

మంగళగిరి పట్టణ పరిధిలో నివాసముండే ఓ చేనేత కార్మికుడు ఆరోగ్య పరిస్థితి బాగోలేదని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే మంగళవారం ఆర్థిక సాయం ప్రకటించి వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు చేతుల మీదుగా ఆ వ్యక్తికి అందజేశారు. మంగళగిరి రెండు రామ మందిరాల వద్ద నివాసముంటున్న చేనేత కార్మికుడు దామర్ల రమేష్ అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంగళగిరి పట్టణం పద్మశాలి బహుత్తమ సంఘం సెక్రటరీ మునగపాటి వెంకటేశ్వరరావు విషయాన్ని ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువెళ్ళగా స్పందించిన ఆయన బాధిత కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించి అందజేశారని మునగాల మల్లేశ్వరరావు తెలిపారు.

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గ్రిల్స్ నిర్మాణానికి మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ళ రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఎమ్మెల్యే ఆర్కే ప్రకటించిన ఆర్థిక సాయాన్ని మంగళవారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూప వాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.విజయ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులకు అదనపు తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్ ఎమ్మెల్యే ఆర్కేకు వాట్సాప్ ద్వారా సమాచారం అందజేశారని చెప్పారు. స్పందించిన ఆయన వరండా గ్రిల్స్, వాల్ నిర్మాణం నిమిత్తం రూ.లక్ష నగదును అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు దానబోయిన వెంకటేశ్వరరావు, వడ్డేశ్వరపు రజనీకాంత్, సంకుర్తి ఏసుపదం, పిల్లి ధర్మరత్నం, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆరోగ్య సురక్షతో ఇంటి ముంగిటకే వైద్యసేవలు



ఫిరంగిపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకే వైద్య సేవలు ప్రభుత్వం అందజేస్తున్నట్లు వైద్యురాలు ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. 363 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులు అందజేశారు. శిబిరంలో వైద్యులు శ్వేత, హసిత, దివ్య, సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నామేరీ, ఎంపీహెచ్‌ఎస్ కె.సుదర్శన్‌రాజు, ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, ఏఎన్‌ఎం ఆనంద కుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



ఫిరంగిపురం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలోని మేరికపూడి, పొనుగుపాడు గ్రామాల్లో ఓటు హక్కు వినియోగం, ఈవీఎంల గురించి ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన నియోజకవర్గ నోడల్ అధికారి సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటు హక్కు వినియోగం, ఈవీఎంలు పనిచేసే విధానం, వీవీప్యాడ్స్ గురించి వివరించినట్లు తెలిపారు. మరో రెండు రోజుల పాటు బేతపూడి, మునగపాడు, యర్రగుంట్లపాడు, గుండాలపాడు గ్రామాల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి విష్ణువర్ధన్‌రావు, వీఆర్వో పుల్లారావు, జాన్‌సైదా పాల్గొన్నారు.

తాడేపల్లిలో బెంచీలు ఏర్పాటు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం పలు ప్రాంతాల్లో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ తాడేపల్లి ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముదిగొండ ప్రకాష్ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి పలు చోట్ల బెంచీలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు బత్తుల దాసు, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చిలుకూటి శ్రీనివాస మధు, కురగంటి ఉదయ రాజు, తొట్టింపూడి వికాస్, బేతం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సున్నావడ్డీ అర్హుల జాబితా ప్రదర్శన

ఫిరంగిపురం: అర్హులైన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలను ప్రభుత్వం అందజేస్తున్నట్లు ఏవో వాసంతి చెప్పారు. మండలంలోని ఫిరంగిపురం, రేపూడి గ్రామాల్లోని ఆర్బీకే కేంద్రాల వద్ద వైఎస్సార్ సున్నావడ్డీ పథకం అర్హుల జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం ద్వారా లక్ష రూపాయల వరకు రుణం తీసుకొని ఏడాదిలోపు తిరిగి చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఖరీఫ్‌లో 2022–2023 ఏడాదికి గానూ 719 మంది రైతులకు రూ.17.83 లక్షలు అందజేస్తున్నట్లు తెలిపారు. సామాజిక తనిఖీ కోసం ప్రతి గ్రామంలోని రైతు భరోసా కేంద్రాలవద్ద సంబంధిత వీఏలు జాబితాను ప్రదర్శించినట్లు తెలిపారు.

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్ట్

తెనాలిరూరల్: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ ఎల్.సరస్వతి మంగళవారం రాత్రి తెలిపారు. ఇటీవలి కాలంలో తెనాలి జీఆర్పీ స్టేషన్‌లో రైళ్లలో చోరీపై రెండు కేసులు నమోదయ్యాయి. సెల్‌ఫోన్‌లు, బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు బాధితులు ఫిర్యాదు చేశారు. వీటిని 01/24, 24/24గా నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులను పొన్నూరుకు చెందిన షేక్ సైదా(ప్రస్తుతం బాపట్లలో నివసిస్తున్నాడు), పొన్నూరుకే చెందిన షేక్‌మస్తాన్‌వలీగా గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా బంగారు గొలుసు, మూడు ఉంగరాలు, వజ్రంతో ఉన్న చెవి దిద్దులు, ఐఫోన్ లభించాయి. నిందితులు తెలిపిన సమాచారం మేరకు వస్తువులను స్వాధీనపర్చుకుని వారిని అరెస్ట్ చేశామని ఎస్ఐ వివరించారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.1.54 లక్షలు ఉంటుందని తెలిపారు.

దొండపాడులో ఆత్మీయ సమావేశం

గ్రామస్తులతో మమేకమైన ఎమ్మెల్యే సుచరిత


మహిళల సమస్యలు తెలుసుకుంటున్న సుచరిత

దొండపాడు(తాడికొండ): తుళ్ళూరు మండలం దొండపాడు గ్రామంలో ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకతోటి సుచరిత పర్యటించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలు విని సానుకూలంగా స్పందించారు. అనంతరం స్థానిక నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి అందరినీ పరిచయం చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. గ్రామంలో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరించేందుకు ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ముఖ్య నాయకులు కొప్పుల శేషగిరిరావు, బొర్రా వెంకట శివారెడ్డి, తుమ్మూరు రమణారెడ్డి, చలివేంద్రం సురేష్, ఆరేపల్లి జోజి, మాతంగి చెన్నకేశవ, శృంగారపాటి సందీప్, కొమ్మినేని దత్తు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పోలకమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పోలకంపాడులో వేంచేసి యున్న శ్రీ పోలకమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. అమ్మవారి 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం నిర్వహించే అన్నసంతర్పణ కార్యక్రమంలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

తుళ్ళూరు డీఎస్పీగా అశోక్ కుమార్

తాడికొండ: తుళ్ళూరు డీఎస్పీగా నూతనంగా నియమితులైన ఈడే అశోక్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ ఏసీపీ ట్రాఫిక్–2 పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న అశోక్ కుమార్‌ను తుళ్ళూరు డీఎస్పీగా నియమించడంతో ఆయన ఇక్కడ విధుల్లో చేరారు. అనంతరం ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకతోటి సుచరితను మర్యాద పూర్వకంగా కలిశారు.

పెన్షనర్ల సంఘం ద్వారా లైఫ్ సర్టిఫికెట్‌లు అందజేస్తాం

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్‌లు తమ లైఫ్ సర్టిఫికెట్లను గురువారంలోగా ట్రెజరీ కార్యాలయంలో అందజేయాలని తెనాలి పెన్షనర్ల సంఘ అధ్యక్ష కార్యదర్శులు మాచిరాజు రామకృష్ణ, సూర్యప్రకాశరావులు ఒక ప్రకటనలో తెలిపారు. లేవలేని స్థితిలో ఉన్నవారి వివరాలు తమకు తెలియజేస్తే వాటిని అందజేసేందుకు సహకరిస్తామని చెప్పారు. ఇప్పటి వరకు రెండు వేల లైఫ్ సర్టిఫికెట్‌లు తమ సంస్థ ద్వారా అందజేయడం జరిగిందని అన్నారు.

సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కల సాకారం


నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న సుచరిత

తాడికొండ: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం జగనన్న ప్రవేశ పెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారానే సాధ్యమని ఎమ్మెల్యే, మాజీ మంత్రి, తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకతోటి సుచరిత అన్నారు. తుళ్ళూరు మండలం ఐనవోలు గ్రామంలో సచివాలయం మొదటి అంతస్తులో రూ.19.50 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు గదుల ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వ పథకాలు అందాలన్నా ఆయా పార్టీల నాయకుల చుట్టూ తిరిగి వారిని ప్రసన్నం చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని, అయినప్పటికీ అర్హులకు సంక్షేమ ఫలాలు అందక నానా ఇబ్బందులు పడేవారన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే గత పాలకులకు భిన్నంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే వెళ్లి సంక్షేమ పథకాలు అందించే రామ రాజ్యం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులకు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి చలివేంద్రం సురేష్, గ్రామపార్టీ అధ్యక్షుడు పాలకాయల శేషగిరిరావు, శాఖమూరు మాజీ సర్పంచ్ తుమ్మూరు వరప్రసాద రెడ్డి, పుట్టి సుబ్బారావు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు నిరాహార దీక్షలకు తరలిరండి


మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతుల రిలే నిరాహార దీక్షలు మార్చి 1 నుంచి నిర్వహించనున్నట్లు పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు తెలిపారు. మంగళవారం దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నామని అన్నారు. కోల్డ్ స్టోరేజ్‌లో పసుపు నిల్వ చేసిన రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం క్వింటాకు రూ.12 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘాల నాయకులు ఈ దీక్షల ప్రారంభ సభలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల మండల రైతు సంఘం కార్యదర్శి వై. బ్రహ్మేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరాజు, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌లో చెలరేగిన మంటలు

అదుపు చేసిన కార్పొరేషన్ సిబ్బంది


మంటలను అదుపుచేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని టిడ్కో నివాసాల సమీపంలోని డంపింగ్ యార్డును గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం తెల్లవారు జామున నిప్పు పెట్టడంతో భారీగా మంటలు ఎగిసిపడి టిడ్కో నివాసాల మధ్య దట్టమైన పొగలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి కార్పొరేషన్ కార్మికులతో మంటలను అదుపు చేశారు. మంటలు అదుపు చేసేందుకు సుమారు 3 గంటల సమయం పట్టింది. పొగ వల్ల టిడ్కో నివాసాల్లో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎట్టకేలకు కార్పొరేషన్ అధికారులు మంటలను అదుపు చేయడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

సేవారత్నకు అభినందన

నడింపాలెం (ప్రత్తిపాడు): ప్రభుత్వానిక ప్రజలకు మధ్య వలంటీర్లు వారధులు అని నడింపాలెం సర్పంచ్ లాం రత్నకుమార్ అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని కార్యదర్శి ఖాజా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సేవారత్నగా ఎంపికైన చావలి గంగాధర్‌తో పాటు సేవామిత్రలుగా ఎంపికైన 25 మంది వలంటీర్లను దుశ్శాలువా, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. సర్పంచ్ రత్నకుమార్ మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందించడం నుంచి, అన్నిరకాల ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు.

మద్యం మత్తులో యువకుడి దురాగతాలు

ఇంటి ముందు పార్క్ చేసిన వాహనాలకు నిప్పు పెట్టి పరారు


తగలబడిన ద్విచక్ర వాహనాలు, సైకిల్

తాడేపల్లిరూరల్ : మద్యం మత్తులో ఓ యువకుడు మంగళవారం తెల్లవారు జామున రోడ్డు వెంబడి పార్క్ చేసి ఉన్న కారుతో పాటు రెండు ద్విచక్రవాహనాలకు నిప్పు పెట్టడంతో కారు పాక్షికంగా కాలగా, రెండు ద్విచక్రవాహనాలు, సైకిల్ పూర్తిగా దగ్ధమయ్యాయి. జరిగిన ఈ సంఘటనపై బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆ ప్రాంతంలో విచారణ చేపట్టి వాహనాలను దగ్ధం చేసిన వ్యక్తి తలగాల దుర్గా ప్రసాద్‌గా గుర్తించారు. సీఐ మధుసూదనరావు తెలిపిన వివరాల ప్రకారం సీతానగరం ఆయుర్వేద వైద్యశాల వద్ద నివాసముంటున్న లోలాకుల నవీన్‌కుమార్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా, పెద్దపెరిగె వెంకటేశ్వర్లు ఇస్త్రీ బండి నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరిద్దరూ రాత్రి సమయంలో 10 గంటల తర్వాత తమ నివాసాల ముందు ద్విచక్రవాహనాలను పార్క్ చేసుకున్నారు. వెంకటేశ్వర్లు ఇంటిముందు సైకిల్ కూడా పార్క్ చేసి ఉంది. ఆ పక్క బజారులో నివసించే కుంబా రమేష్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తన కారును ఇంటిముందు పార్క్ చేసుకున్నాడు. తెల్లవారు జామున రెండు గంటల సమయంలో అదే ప్రాంతంలో నివసించే తలగాల దుర్గా ప్రసాద్ మొదట రెండు ద్విచక్రవాహనాలకు నిప్పు పెట్టగా పక్కనే ఉన్న సైకిల్ కూడా కాలిపోయింది. ఆ రెండు వాహనాలు తగలబెట్టిన అనంతరం పక్క వీధిలో కుంబా రమేష్ కార్ పార్క్‌చేసి ఉండగా కారుమీద సిగరెట్ పడవేశాడు. మద్యం అలవాటు ఉన్న దుర్గాప్రసాద్‌కు నరాల బలహీత ఉండడంతో మందులు వాడుతున్నాడని, మద్యం, మందుల మత్తులో ఇలా ప్రవర్తించాడని వారి కుటుంబ సభ్యులు తెలిపారని చెప్పారు. ప్రస్తుతం దుర్గాప్రసాద్ ఇంటి వద్ద లేదని జరిగిన సంఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బ్యాంక్‌లోన్ ఇప్పిస్తానంటూ మోసం

చికెన్ షాపు నిర్వాహకుడి వద్ద నుంచి రూ.15వేలు నగదు కాజేసిన యువకుడు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం రోడ్‌లో ఓ చికెన్ షాప్ యజమానికి లోన్ ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తి మోసం చేసి ఆయన ఖాతాలో డబ్బులను మాయం చేసి పరారైన ఘటన వెలుగు చూసింది. మంగళవారం చికెన్ షాప్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళగిరి పోలీసులు తాడేపల్లి పోలీసులను అప్రమత్తం చేయడంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. సేకరించిన వివరాల ప్రకారం తాడేపల్లి పోలకంపాడుకు చెందిన శ్రీనివాసరావు అనే చికెన్ వ్యాపారి మంగళగిరి యర్రబాలెం రోడ్‌లో చికెన్ షాపు నడుపుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తన పేరు సాయి సందీప్‌గా తాను బ్యాంకులో పనిచేస్తున్నానని పర్సనల్ లోన్ ఇప్పిస్తానని చెప్పి శ్రీనివాసరావును నమ్మించాడు. శ్రీనివాసరావును మాటల్లో పెట్టి తన వద్ద ఉన్న ఆండ్రాయిడ్ ఫోన్ తీసుకుని శ్రీనివాసరావు అకౌంట్‌లో ఉన్న రూ.15 వేల నగదును ఫోన్‌పే ద్వారా కృష్ణాజిల్లా పోరంకికి చెందిన మొక్కపాటి నాగ ఫణీంద్రకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అనంతరం అక్కడి నుంచి సాయి సందీప్ బండిపై ఉడాయించాడు. ఖాతా నుంచి ఫోన్‌పే ద్వారా రూ.15 వేలు వేరే ఫోన్ నెంబర్‌కు బదిలీ అయిన విషయం గమనించిన శ్రీనివాసరావు పోలీసులను ఆశ్రయించగా శ్రీనివాసరావు ఫోన్ నుంచి నగదు బదిలీ చేసిన నెంబర్‌ను సంప్రదించారు. తన పేరు నాగ ఫణీంద్ర అని, ఫణీంద్ర ఫోన్‌పేకు సాయి సందీప్ డబ్బులు పంపాడని, తిరిగి సాయి సందీప్‌కు డబ్బులు చెల్లించానని తెలపడంతో ఫణీంద్ర ఇచ్చిన సమాచారం మేరకు తాడేపల్లి పోలీసులను అప్రమత్తం చేశారు. ద్విచక్రవాహనంపై వెళుతున్న సాయి సందీప్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితుడి వద్ద నుంచి మరింత సమాచారం సేకరిస్తున్నట్లు సీఐ మధుసూదనరావు తెలిపారు.

పరిశుభ్రతతో ఆరోగ్యకర జీవితం

గుంటూరు రూరల్: పచ్చదనం పరిశుభ్రతతో ఆరోగ్యకరమైన జీవితం ఏర్పడుతుందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. ఏఎన్‌యూ, కళాశాల సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పచ్చదనం పరిశుభ్రతపై జొన్నలగడ్డ గ్రామంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక అవసరాలైన గాలి, భూమి పరిశుభ్రంగా ఉంచినట్లయితే మంచి ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమవుతుందని తెలిపారు. గ్రామంలోని వీధుల్లో తిరిగి ప్రజలకు మొక్కలు పెంపకం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యుడు ఐదయ్య, జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ కేఎస్ రజనీకాంత్ పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీ ప్రజాపోరు యాత్ర

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు కుమార్ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని రకాల అభివృద్ధి పనులకు సాయం అందజేస్తున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద నిధులు అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వి.హరిబాబు, నాయకులు ఎం.శివ, ఎం.నరేంద్ర, జి.చంద్రశేఖర్, ఆర్.శివారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

ముగ్గురు జూదరులు అరెస్టు

ప్రత్తిపాడు: కోతముక్కాట ఆడుతున్న ముగ్గురు జూదరులను ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేశారు. గ్రామశివారులో రహస్యంగా కోత ముక్కాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న ఎస్ఐ వి.సోమేశ్వరరావు సిబ్బందితో కలిసి జూదస్థావరంపై దాడి చేసి కోత ముక్కాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోనికి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 4,060లు స్వాధీనం చేసుకున్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

వాసం సూరిబాబు, పి. శ్రీదేవి, న్యాయవాదులు, ప్లాట్ నెం.106, [illegible], గుంటూరు, సెల్: 9849402968